పుస్తకం

తెలుగునాట గిరిజనులు

తెలుగుదేశంలోని గిరిజనుల చరిత్ర, సంస్కృతులను వివరించే పరిశోధనా గ్రంథమిది. గతంలో "తెలుగు గిరిజన గీతాలు"అనే సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించిన శివరామకృష్ణగారు, తరువాత కాలంలో అదనపు సమాచారాన్ని సేకరించి, పరివర్ధిత ముద్రణగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు.

ఇందులోని మొదటిభాగం 'తెలుగు గిరిజనుల స్థానం-ప్రస్థానం'. ఇందులో తూర్పు కనుమలలో ఉన్న గిరిజనతెగలు-వారి సంస్కృతుల గురించి వివరిస్తూ క్రమంగా గిరిజనులు, జానపదులైన వైనాన్ని తెలియజేస్తారు. తెలుగు గిరిజనులున్న అడవులలోని భూస్వభావం, వర్షపాతంవల్ల ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో వారి జీవన వైవిధ్యంలోఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు, జీవనరీతులు, తెగలలోఉన్న ఆధిపత్యధోరణులు, కాలక్రమంలో వాటిలో చోటుచేసుకున్న మార్పులను ఆసక్తికరంగా వివరించారు. కుటుంబంలో, సమాజంలో ఉన్న స్త్రీ, పురుష సంబంధాల గురించి, వారి కట్టుబడి, ప్రవర్తనల గురించి 'స్త్రీ సంయోగం'లో తెలియజేశారు. గోదావరి, విశాఖ తెగల వ్యవసాయంలో తారతమ్యాలనుతెలిపిన రచయిత వ్యవసాయాధారితక్రతువులను, పండుగలను, కర్మకాండలను, విశ్వాసాలను 'పండుగ పదాల'తో వివరంగా తెలియజేశారు. నాగరికత-అభివృద్ధిపేరిట కొంత, వ్యాపారంకోసం కొంత మైదానప్రాంతాలవాళ్ళు చొచ్చుకువచ్చి గిరిజనుల సంస్కృతిని-వారి జీవితవిధానాన్ని సర్వనాశనం చేశారు. అడవులు నశించి, భూములు అన్యాక్రాంతమై గిరిజనులు ఆకలిదప్పులతో, అంటువ్యాధులతో అణగారిపోతున్నారు. బలహీనవర్గాలకై ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలను గిరిజనులకు యథాతథంగా అన్వయించడం అవగాహనాలోపమే. గిరిజనుల స్వభావాలకు-నైపుణ్యాలకు అనువైన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.

రెండవభాగం 'కొండకోనల్లో తెలుగుపాట'. ముందుగా కొండరెడ్ల పాటలు. వారి వివాహ కార్యక్రమాలలో జరిగే హడావుడి, వేళాకోళాలను చిత్రీకరించిన పాటలు- అయినవారి మధ్యన, వావివరసల చాటున కొనసాగే పాటల సేకరణ ఇందులో ఉంది. ఇక విశాఖగిరిజనులపాటల'లో కన్నెవయసు, ప్రేయసీప్రియుల కలయిక, దూరపు సంబంధాలు, భార్యతో జగడాలు, అత్తా-కోడళ్ళ పాటలు, చాటు సరసాలు, వదినా మరదులు, దేవతల పాటలు, జోలపాటలు, లొల్లోసి పాటలు, పండుగ పాటలున్నాయి. మన్యం పాటలలో 'పితూరీదండు'కు సంబంధించిన పాటలన్నీ లుప్తంకాగా, దొరికిన పదాన్ని సేకరించి ఇవ్వడం అపురూపమే. చివరగా 'మోదకొండమ్మ' కథాసంగ్రహంతోపాటు కథాగానం పూర్తిపాఠాన్ని ఇచ్చారు. "నల్లమల చెంచులపాటల"లో రావగానిపాట, ఆ కథాగానం పూర్తిపాఠాన్ని సేకరించాడు. దానికితోడు అందరికి తెలిసిన పాపులర్ పల్లవి "గురుగింజ గురమల్లెలూ"తో, వరాన్వేషణలో చెంచును ఎన్నుకున్న యువతి పాటను ఇవ్వడం బాగుంది. ఇక మూడవభాగం 'శైలి-భాష'. కొండరెడ్ల పాటలు తాళ ప్రధానాలు. ఆటకు తగిన నడక వారిది. విశాఖ గిరిజనుల ఆటలో నరికె, తొడుము, సన్నాయివాద్యాల హోరు ఎక్కువ. విశాఖపాటలలో రాగచ్ఛాయ వల్ల ఆ బాణీ అన్నిరకాల జానపదుల పాటలను తమకనువుగా మలచుకుంటుందంటారు. కొన్ని కథాగేయాలున్నా విశాఖపదాలు ఎక్కువ ముక్తకాలు. ఉయ్యాల, లొల్లోసి పాటల బాణీలకు స్వతంత్ర వ్యక్తిత్వమున్నది. కాని కొండరెడ్ల పాటలకున్న ప్రత్యేకమైన అస్తిత్వం వాటిలో తగ్గిపోయింది. కొండరెడ్ల సంవాదశైలి ఎంత హృద్యమైనదో విశాఖ పాటలలో సాత్విక భావచిత్రణ అంత పటిష్టమైనవంటారు. చివర నాలుగు భాగాలుగా విభజించిన తూర్పు గిరిజన ప్రాంతాల తెలుగు మాండలికపు తీరుతెన్నులు, మాండలికపదాలకు అర్థవివరణచేయడం బాగుంది. ఈ గిరిజనులను మాలిడ్లు-ఆస్ట్రోలాయిడ్లు తెగగాగుర్తించి, పురాణాల్లో, చరిత్రలో కనిపించే గిరిజననాయకులు- ప్రాంతాల గురించి వివరించారు. తెలుగు ఆచార సంప్రదాయాలమీద గిరిజన సంస్కృతి ప్రభావాన్ని తెలిపిన తీరు ఆకట్టుకుంటుంది. ప్రభుత్వ విధాన [illegible] విద్యమాల మీద వేసిన చురకలు మనల్ని ఆలోచింపజేస్తాయి. విస్తృతంగా సమాచారాన్ని సేకరించిన పరిశోధకుడు, ఆ సమాచారాన్ని సరిగ్గా వింగడించుకోవడంలోనూ, క్రమపద్ధతిలో అమర్చుకోవడంలో మరింత శ్రద్ధ చూపితే బాగుండేది. అలాగని పరిశోధకుడి నిరంతర పరిశోధనాశక్తిని, నిజాయితీని, నిబద్ధతను అభినందించకుండా ఉండలేం.

కొండ కోనల్లో తెలుగు గిరిజనులు

రచయిత

శివరామకృష్ణ

ప్రతులకు

శక్తి, 305, జనప్రియఅబోడ్స్

గాంధీనగర్, హైదరాబాద్

వెల: రూ. 200

■ కె.పి.అశోక్‌కుమార్